


# కరిగిన కల

-బి.మాధవి

చదువు పూర్తి చేసుకుని చాలాకాలం తర్వాత తన ఊరికి వస్తున్నాడు చైతన్య.

స్టేషన్‌లో రైలు ఆగగానే కొండంత ఆనందంతో దిగి తనవారి కోసం కళ్లు వెతికాయి.

అల్లంత దూరంలో నాన్న, తమ్ముడు కిరణ్... తనవైపు వస్తున్నారు.

తన్మయత్వంతో అన్నయ్యని కౌగిలించుకున్నాడు కిరణ్.

నాన్న కళ్లల్లో ఆప్యాయత తొణికిసలాడింది.

ఇంటి వద్ద అమ్మ మనసులో కొడుకును చూడాలన్న కుతూహలం తారాస్థాయికి చేరుకుంది.

మరదలు కవిత విషయం చెప్పనలవి కావటంలేదు. ఏ అలికిడి విన్నా బావ వచ్చాడేమోనన్న భావనతో అటువైపు పరుగెత్తుతూ ఉంది.

ఇంటి ముందు ఆటో ఆగడంతో అమ్మ, కవిత గుమ్మం దగ్గరి కొచ్చారు. అమ్మ అలానే నిల్చుంది. కవిత సిగ్గుతో పెరట్లో కెళ్ళి మల్లెపొద మాటున కూర్చుంది.

అందరూ కుశల ప్రశ్నల వర్షం కురిపించారు.

కవిత అటు సంతోషాన్ని, ఇటు దుఃఖాన్ని నింపుకుంది. దుఃఖాన్ని పారద్రోలాలని ఎంతగా ప్రయత్నించినా కుదరటం లేదు. సంతోషంగా కనిపించాలి కావున తన ముఖంపై సంతోషాన్ని పులుముకుంది.

తానెలా చైతన్యకు కనిపించాలో...

ఏం మాట్లాడాలో... అసలెలా ప్రారంభించాలో... అంతా గజిబిజిగా ఉంది మనసు...

విధిగీసే వక్రరేఖలకు నిలువెత్తు సాక్ష్యం కవిత.

ఇష్టంలేని పెళ్ళి...

పెళ్లై న మూడు నెలలకే భర్త చనిపోవటం...

తిరుగుటపాలా అమ్మగారింటికి వచ్చేయటం...

ఏ సుఖ సంతోషాలూ లేకుండా జీవచ్ఛవంలా గడపటం...

ఇవి కవితను గురించి చెప్పే సాక్ష్యాలు...

చైతన్య ఇంటికి రాగానే కవిత గురించి అడిగాడు.

అమ్మ అంతా చెప్పింది.

'కవితకు అలా జరిగి ఉండాల్సింది కాదు... పాపం' అన్నాడు.

'ఇందాకా ఎదురుచూసిన కవిత, ఇప్పుడే పెరట్లో కెళ్ళి దాక్కుంది' అని చెప్పింది అమ్మ.

చైతన్య వెనగ్గా వెళ్ళి చెంబు నీళ్లు గుమ్మరించాడు.

తప్పించుకుని పక్కన నిల్చుంది కవిత.

ఆమె ముఖంలో విషాద చాయలు చెప్పకనే చెబుతున్నాయి.

ముఖంలోకి తీక్షణంగా చూశాడు చైతన్య.

రెండు నిమిషాల తర్వాత చూడలేక పోయాడు.

'కవితా... బొట్టు పెట్టుకోవచ్చుగా' అన్నాడు.

మనసులో అనంతమైన ప్రశ్నల హోరు.

'దేనికయినా ప్రాప్తముండాలి బావా...' అంది పైకి కవిత కనుకొలుకుల్లో ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ, దుఃఖాన్ని పెదాల మధ్య బిగపట్టుకుని ఇంట్లోకి వెళ్ళిపోయింది.

మాట అన్నాడేగాని మనసులో బాధ కుదిపేస్తోంది. కవితకు ఇలా జరిగి ఉండాల్సింది కాదు అనుకున్నాడు. ఇలాంటి జీవితం ఎవ్వరికీ రావద్దు అనుకున్నాడు. కవిత గురించే ఆలోచిస్తూ కాలం గడిపాడు.

భోజనాలు ముగిశాయి. తర్వాత తన మిత్రుల నందరినీ కలిసి వచ్చాడు చైతన్య. తన చిన్నప్పటి మాస్టారు రాజారావు గారిని కలవటానికి వెళ్ళాడు.

'నీ గురించి చాలా విన్నా చైతన్యా...' అన్నారు మాస్టారూ.

'సార్. అంతా మీ చలవే. మీరు పెట్టిన భిక్షే నన్ను ఇంతవాణ్ని చేసింది సార్. మీకు ఎప్పుడూ రుణపడే ఉంటాను' అన్నాడు రవి.

మాస్టారి వదనం ఆనందంతో పొంగిపోయింది.

'మన స్కూల్లోనూ... మన ఊళ్లోనూ, అక్కడక్కడ నిన్ను అనుకుంటూ ఉంటారు చైతన్య. నేనూ పిల్లల్తో చెబుతూ ఉంటాను. మీరు కూడా చైతన్యలాగా బాగా చదివి మంచి పేరు తెచ్చుకోవాలని... చైతన్యా... నిజంగా నీలాంటి కొడుకు ఒక్కడున్నా చాలు...' అంటూ చైతన్య భుజం తట్టాడు మాస్టారూ.

చైతన్య గొంతు ఆనందంతో మూసుకుపోయింది.

చైతన్యకు రెండు మాసాల తర్వాత, అదే ఊరికి టీచరుగా ఉత్తర్వులొచ్చాయి. ఇది కొండంత సంబరం.

ఊరు ఊరంతా సంబరాలు చేసుకుంది.

సంవత్సర కాలం తిరిగిపోయింది.

చైతన్యకు పెళ్ళి సంబంధాలు వస్తున్నాయి. నిరాకరిస్తున్నాడు. కారణం ఎవరూ అడగలేదు. తనూ చెప్పలేదు.

చాలా ప్రశ్నలకు తన మౌనమే సమాధానమైంది. విషయాల్ని అన్యమనస్కంగా వింటాడు చైతన్య.

తన చిన్ననాటి విషయాలన్నీ గుర్తుకు రాసాగాయి.

వాస్తవానికి మేనమామ కూతురు కవితను పెళ్ళిచేసుకోవాలని చిన్నప్పట్నుంచీ కోరిక. అత్త, మామలు అక్కడక్కడా

చైతన్య వెనగ్గా వెళ్ళి చెంబు నీళ్లు గుమ్మరించాడు. తప్పించుకుని పక్కన నిల్చుంది కవిత. ఆమె ముఖంలో విషాద చాయలు చెప్పకనే చెబుతున్నాయి. ముఖంలోకి తీక్షణంగా చూశాడు చైతన్య. రెండు నిమిషాల తర్వాత చూడలేక పోయాడు. 'కవితా... బొట్టు పెట్టుకోవచ్చుగా' అన్నాడు. మనసులో అనంతమైన ప్రశ్నల హోరు. 'దేనికయినా ప్రాప్తముండాలి బావా...' అంది పైకి కవిత కనుకొలుకుల్లో ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ, దుఃఖాన్ని పెదాల మధ్య బిగపట్టుకుని ఇంట్లోకి వెళ్ళిపోయింది.

చైతన్య, కవితల అన్యోన్యతలను నొక్కి చెబుతూ వీళ్ళు ఒకటయితే బాగుంటుందని అనేవారు.

గిల్లికజ్జాలు ఆడిన రోజు గుర్తుకొచ్చి గుండె బరువైంది. ఏకాంతంలో చెప్పుకున్న మాటలు, చేసుకున్న బాసలు, జ్ఞప్తికొచ్చి కళ్ళు చెమర్చాయి. మనసు మనసులో లేదు. ఏం చేయాలో తెలియని అచేతనావస్థలో బేలగా చతికిల బడిపోయాడు చైతన్య.

అమ్మ ఎదురుగా కూర్చున్నాడు.

కవిత గురించి ఎన్నెన్నో చెప్పాలనుకున్నాడు.

మళ్ళీ తనే 'అవన్నీ చైల్డిష్' అనుకున్నాడు.

పెదవి విప్పి 'అమ్మా...' అన్నాడు నసుగుతూ. ఆ పిలుపులో బాధ కనిపించింది. తర్వాత నోట మాట రాలేదు. కంఠం కూరుకుపోయింది.

చైతన్య కళ్ళలో నీళ్లను చూసి అమ్మ ప్రశ్నార్థకమైంది.

'ఏంటి చైతన్యా... ఎందుకు? ఏమైంది నాన్నా' అంటూ దగ్గరకు తీసుకుంది.

'ఎందుకమ్మా... కవిత జీవితం ఇలా అయింది. దేవుడెందుకు ఇంత చిన్నచూపు చూశాడు. మన ఇంటి కోడలు కావల్సిన కవిత... ఏ పంచకో వెళ్ళింది. వెళ్ళినా సుఖపడి ఉంటే... మనం కూడా సంతోషంగా ఉండేవాళ్లం. తీరా చూస్తే కవిత జీవితం పగిలి ముక్కలై పోయింది. ఇక కవితను ఏమని ఊహించాలి...' అంటూ భోరున ఏడ్చాడు.

'ఏంటో... అన్నీ మన జీవితాలకే ఇలా జరుగుతాయో... ఏమో మరి. ఉన్నట్లుండి కవిత వాళ్ల మేనమామ మంచాన పడ్డాడు. రేపోమాపో పోతాడన్నారు. ఆయన 'కొడుకు' పెళ్ళి తప్పకుండా చూడాలన్నాడట. అదీ మేనకోడలు కవితనే కావాలని... తన చివరి కోరికను చెప్పాడట. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఎవరు మాత్రం చనిపోయేవారి మాట కాదంటారు. మూడు రోజుల్లో పెళ్ళి ముగించారు. ముగించిన రెండు నెలలకే తండ్రీ కొడుకులిద్దరూ కన్ను మూశారు. ఇది విధి విధించిన కఠిన శిక్షే పాపం... కవిత జీవితం ఎడారి పాలయింది' అమ్మ కళ్ళు చెమర్చాయి.

జీవితాలు ఊహించుకున్నట్లు జరిగితే అంతకంటే ఇక మనిషికి కావల్సింది ఏముంటుంది. కానీ... విధి వక్రిస్తే తీరం చేరాల్సిన నావ ఆటుపోట్ల తాకిడికి పగిలి ముక్కలై ఏ ముక్క ఏ తీరాన్ని చేరుతుందో ఎవరు మాత్రం ఊహించగలరు...?

అలాగే కవిత జీవితం.

* * *


చూసే సంబంధాలేవీ ఇష్టపడటం లేదు చైతన్య.

తల్లిదండ్రులు విసిగిపోయారు. నిలదీసి అడిగినా ఏమీ చెప్పడు. మిత్రుల ద్వారా అడిగించి చూశారు కూడా.

ఫలితం లేదు.

మూడు నెలల సంసార జీవితం ఎంత?

ఆ మూడు నెలల జీవితాన్ని గడిపినందుకు బతికినన్ని రోజులూ భరించే శిక్ష అంత సులభమయిందేమీ కాదు. విధవగా ముద్రపడి, చులకనగా చూస్తున్న సమాజాన్ని



చూస్తూ చైతన్య చలించిపోయాడు. చుట్టూ ఉన్న సమాజాన్ని ఛీదరించుకున్నాడు.

చైతన్య పరిస్థితి చూసి తల్లిదండ్రులు దుఃఖించారు. తన మనసులో మాట చెప్పడానికి సిద్ధపడ్డాడు చైతన్య.

అమ్మ, నాన్న, చైతన్య ఎదురెదురుగా కూర్చున్నారు. ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటున్నారు. చైతన్య గొంతు సవరించుకుని మాట చెప్పేలోపే... నాన్న 'చైతన్యా... నువ్వేం చిన్నపిల్లాడివి కాదు. నీ పెళ్ళి గురించి ఏదో ఒక నిర్ణయం చెబితే బాగుంటుంది.' అన్నారు.

చైతన్య కళ్లలోకి చూడలేక పోయింది అమ్మ.

'నాన్నా. మనం ఎప్పట్నించో కవితను మనింటి కోడలిగా చేసుకోవాలనుకున్నాం. విధి వక్రించి కవిత బతుకు గమ్యం లేని బతుకయింది. సమాజం చులకనగా చూస్తుంటే మనం చూస్తూ భరించగలమా...!

ఆమె ఎవరైనా పరాయి మనిషా?

మన మనిషే కదా.

కాని దానిలా వదిలేయటం మంచిదా?

తను బాధపడుతూంటే ఇటు నేను పెళ్ళి చేసుకుని సుఖంగా ఉంటానని అనుకోవటం వట్టిమాటే. నాన్నా, మీరే ఓ మారు ఆలోచించండి.

కవితను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నా. ఆలోచించి చెప్పండి...' అన్నాడు చైతన్య.

'అదేమంత మంచిగా లేదురా... సమాజానికి ఏం సమాధానం చెబుదాం. ఊరంతా కోడై కూయదా. ఈ ఆలోచన మానుకో' అంది అమ్మ.

'సమాజంతో... ఊరితో మనకేం పనమ్మా. మన సుఖం. మన మనిషి సుఖం మనం చూసుకోవాలి. సమాజాన్నంతటినీ సంతోషపెట్టడం కోసం... మన సొంత ఇంటి మనిషిని జీవితాంతం బాధపడేలా చేయాలా... కవిత జీవితాంతం ఏడుస్తూ బాధపడుతూ ఉండటం నేను చూడలేను. ఈ జీవితం కంటే చావే నయమనిపిస్తుంది...' అంటూ బాధపడ్డాడు చైతన్య.

అదీ నిజమే ననిపించింది అమ్మా నాన్నలకు.

అంతలో కవిత అక్కడకు వచ్చింది.

అమ్మా నాన్న మెల్లగా కదిలారు అక్కడ్నుంచీ.

చైతన్య, కవితల మధ్య మౌనం రాజ్యమేలుతోంది.

కవిత అన్యమనస్కంగా ఉండిపోయింది.

'బావా... ఎందుకలా పాలిపోయినట్లున్నావు... మొన్న తెచ్చిన పెళ్ళి సంబంధం గురించి ఏం చెప్పావ్?' అడిగింది మెల్లగా కవిత.

'నువ్వేమీ అడక్కు కవిత. పెళ్ళంటూ చేసుకుంటే నిన్నే చేసుకుంటా. లేదా జీవితానికి చరమగీతం పాడాలనుంది. అదే నా మాట...' అంటూ కవిత కళ్ళల్లోకి చూశాడు చైతన్య.

కవిత మౌనంగా వెళ్ళిపోయింది.

అమ్మ, నాన్న - కవిత తల్లిదండ్రుల్ని పిలిపించి మాటలాడి ఒప్పించారు.

కవిత కళ్ళల్లో కాంతిపుంజం విచ్చుకుంది.

చైతన్య జీవితంలోకి వసంతం అరుదెంచింది.

కమ్మగా కరుగుతున్న కలలో జీవితాన్ని పంచుకుని, నవజీవన సౌందర్యానికి నాందీ గీతిక రచిస్తున్నారు.

★

# ఈ స్మశానం ఓ టూరిస్టు సెంటర్!

స్మశానానికి విహారం వెళ్లే వారు ఎవరైనా ఉంటారా? స్మశానానికి వెళ్లడం అంటే తిరిగి రాని లోకానికి వెళ్లడమనే లెక్క. అయితే మళ్లీ తిరిగి రావడం కోసమే స్మశానానికి వెళ్లండి.. అంటూ ఉంది ఇండోనేషియా ప్రభుత్వం. ఇండోనేషియాలోని బాలి నగరానికి దగ్గర్లో ఉన్న ఈ స్మశానంలో ఇప్పుడు మౌనం రాజ్యమేలడం లేదు. జన సందడితో కళకళలాడుతూ ఉంది. ఒకదాన్ని మరోటి ఆనుకొని ఉన్న పుర్రెలు మీకు స్వాగతం పలుకుతూ ఉంటాయి. తెల్లటి వస్త్రం కప్పుకుని ఉన్న ఓ శవం మిమ్మల్ని చూసి నవ్వుతూ ఉన్నట్లు ఉంటుంది. నిజంగానే కింతామణి జిల్లాలోని త్రున్యాన్ అనే గ్రామం టూరిస్టులకు ఆదరంగా స్వాగతం పలుకుతూ ఉంటుంది. ఈ గ్రామానికి గ్రామమే స్మశానం. ఓ దీవిలాగా ఉండే ఈ చిన్న గ్రామానికి వెళ్లాలంటే కెదిసాన్ అనే చోటునుంచి పడవలో వెళ్లాలి. కాస్త కళ్లు మూసుకుని ధైర్యం చేసి పడవలో కూర్చుంటే ఓ అరగంటలో అది మిమ్మల్ని అక్కడికి చేరుస్తుంది. భయపడాల్సిన పనేమీ లేదు. మళ్లీ అంతే క్షేమంగా మిమ్మల్ని వెనక్కి తీసుకు వస్తుంది. బాలి ఆగ తెగ వారు తమ వారు ఎవరైనా చనిపోతే మన పార్సీ వారిలాగానే వారికి అంత్య సంస్కారాలు చేయరు. శవాన్ని తెచ్చి ఈ చెట్టుకింద పడుకోబెట్టారు. ముఖం మాత్రం కనిపించేలాగా ఉంచి మిగతా శరీరమంతా తెల్లటి బట్ట కప్పుతారు. అక్కడితో వారి రుణానుబంధం తీరిపోతుంది. మిగతాది ప్రకృతే చూసుకుంటుంది. ఇలా చేయడం వల్ల చనిపోయిన వారికి పరలోకంలో కష్టాలు ఉండవనేది వీరి నమ్మకం. ఈ చెట్టుకూడా సామాన్యమైనదేమీ కాదు. గతంలో ఇది సువాసనలు వెదజల్లేదట. ఈ అంత్య సంస్కారాన్ని 'మెపాస్' అంటారు. వారి నమ్మకాలు ఏమయినా ఉండవచ్చు కానీ ఇప్పుడీ స్మశానం టూరిస్టులకు ఓ పెద్ద కేంద్రమవుతోంది. వెళ్లే వాళ్లకు కాస్త ధైర్యముంటే చాలు మరి!

-ఆర్కే

